పశువులకు టీకాలు తప్పనిసరి

- మూగజీవాలపై సీజనల్ వ్యాధుల ప్రభావం
- జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదం

గుడివాడరూరల్: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పశువులకు టీకాలు తప్పనిసరి అని పశువైద్యులు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు మనుషులకే కాదు మూగ జీవాలకు సైతం సంక్రమిస్తాయి. విస్తారంగా కురిసిన వర్షాలకు పచ్చగడ్డి పెరగడంతో పాటు పచ్చిక తినే పశువుల కడుపులోకి మట్టి కూడా చేరుతుంది. ఫలితంగా పశువుల కడుపుల్లో నత్తలు తయారవుతున్నాయని పశు పోషకులు వాపోతున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు విరోచనాల వ్యాధి వస్తుంది. దీంతో పశువులు బక్కచిక్కిపోయి వ్యవసాయ పనులకు అక్కరకు రాని పరిస్థితులు నెలకునే ప్రమాదం ఉంటుందని పశు పోషకులను ముందస్తుగానే పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటితో పాటు గొంతు వాపు, గాలికుంటు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని, వ్యాధుల లక్షణాలను ముందే గుర్తించి, సరైన చికిత్స అందిస్తే పశువులను కాపాడుకునే అవకాశం ఉంటుందని పశు వైద్య నిపుణులు పశు పోషకులకు సూచిస్తున్నారు.

జబ్బువాపు వ్యాధి

ఆరోగ్యంగా ఉండే తెలుపురంగు జాతి దూడలకు సైతం ఈ వ్యాధి సోకే అవకాశాలుంటాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ వ్యాధి సోకుతుందని, భుజం, తొడ ప్రాంతంలో మాంసం కుళ్లిపోయి, వాపు వచ్చి ఆ వాపు దగ్గర కరకర శబ్దం వినిపిస్తుందని అంటున్నారు. దీనికి సకాలంలో చికిత్స అందకపోతే 12 గంటల నుంచి 48 గంటల్లో ఈ వ్యాధి సోకిన దూడ మృత్యువాత పడే



గేదెకు టీకా వేస్తున్న పశు వైద్యుడు (ఫైల్)

ప్రమాదం ఉంది. జబ్బువాపు వ్యాధి నివారణకు ముందస్తుగానే తొలకరిలో టీకాలు వేయించాలి. ఒకవేళ వ్యాధి సోకిన పశువులకు యాంటిబయోటిక్స్, పెన్సిలిన్ రకపు ఇంజెక్షన్లు మూడు నుంచి ఐదు రోజులు క్రమం తప్పకుండా వేయించాలి.

గొంతు వాపు వ్యాధి

ఈ వ్యాధి సోకిన పశువులు ఎక్కువశాతం మృత్యువాత పడే అవకాశాలున్నాయి. వ్యాధి సోకిన పశువులకు అత్యధిక శరీర ఉష్ణోగ్రత వల్ల కంటి నుంచి నీరు కారడం, ఎర్రబడిపోవడం, నోటినుంచి చొంగ కారడం, గొంతు, మెడపై వాపు రావడం, శ్వాస కష్టంగా మారడం వంటివి జరుగుతాయి. ఈ వ్యాధి సోకిన పశువులు సకాలంలో వైద్య సేవలు తీసుకోకపోతే మృతి చెందే అవకాశాలున్నాయి. చలి గాలులు, అధిక వర్షాల్లో ఎక్కువ దూరం ప్రయాణం చేసినప్పుడు పశువులు ఒత్తిడికిలోనై ఈ వ్యాధి బారిన పడే అవకాశాలున్నాయి. ఈ వ్యాధి నివారణకు ముందస్తుగా తొలకరిలో టీకాలు వేయించాలి. ఒకవేళ వ్యాధి సోకితే పశువులకు యాంటిబయోటిక్స్, నొప్పి నివారణ సూది మందులు, శ్వాస తీసుకోవడానికి స్టెరాయిడ్ ఇంజెక్షన్లు చేయించాలి.

గాలికుంటు వ్యాధి

ఈ వ్యాధి సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. నోటిలో నాలుకపై, పళ్ల చిగుళ్లపై నీటి కురుపులు ఏర్పడి చితికిపోవడంతో ఆ పశువులు మేత తినడం మానేస్తాయి. నోటి నుంచి నురగ కారుతుంది. నడవటానికి ఇబ్బంది పడతాయి. ఈ వ్యాధి సోకకముందే ముందస్తుగానే టీకాలు వేయించడం ఉత్తమ మార్గం. వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి, పునరుత్పత్తి సామర్థ్యం బాగా తగ్గిపోతాయి. ఈ పశువులకు యాంటి బయోటిక్స్, విటమిన్ ఇంజెక్షన్లు, నొప్పి నివారణ సూది మందులు వేయించాలి.

పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులు సోకిన పశువులను మంద నుంచి వేరు చేసి, ఆ పశువులకు మేత, దాన విడిగా అందించే విధంగా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులకు వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి దగ్గరలో ఉన్న పశు వైద్యులను సంప్రదిస్తే వాటి ప్రాణాలను రక్షించుకోవచ్చు. గ్రామాల్లో చాలా మంది రైతులు పాడి సంపదపై జీవిస్తున్నారు. మూగజీవాల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే దగ్గరలోని పశు వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించాలి.

–వి.హనుమంతరావు, పశు వైద్యాధికారి

రహదారిపై అడ్డంగా పడిన వృక్షం



రహదారిపై అడ్డంగా పడిన వృక్షం



సంఘటన స్థలం నుంచి పామర్రు వరకు నిలిచిపోయిన ట్రాఫిక్

గంటల తరబడి నిలిచిపోయిన రాక పోకలు

పామర్రు: ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పామర్రు–చల్లపల్లి రహదారిలో ఓ వృక్షం అడ్డంగా నేల కొరిగింది. దీంతో పామర్రు నుంచి చల్లపల్లి వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పామర్రు–చల్లపల్లి జాతీయ రహదారిలోని రాపర్ల అడ్డరోడ్డువద్ద రోడ్డు పక్కనే ఉన్న ఓ వృక్షం వర్షానికి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. తప్పించుకుని వెళ్లే మార్గం లేక తెల్లవారుజాము నుంచి అన్ని వాహనాలు నిలిచిపోయాయి. కురుస్తున్న వర్షానికి ఎటూ వెళ్లలేని స్థితిలో తమ గ్రామాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు చాలా గంటలసేపు ఇబ్బందులకు గురయ్యారు. సంఘటన స్థలం నుంచి పామర్రు నాగులేరువంతెన వరకు, అటుపక్క నాగపట్నం వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ నిలిచి పోయింది. ఈ విషయాన్ని ఆర్అండ్బీ అధికారులకు తెలియజేసి రహదారిలో అడ్డంగా పడిపోయిన వృక్షాన్ని తొలగించాలని కోరినా ఎవరూ స్పందించలేదు. పామర్రు ఎస్ఐ ప్రవీణ్కుమార్రెడ్డికి



క్రేన్ సాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్ను నియంత్రిస్తున్న ఎస్ఐ ప్రవీణ్కుమార్రెడ్డి

సమాచారం తెలియజేయటంతో ఎస్ఐ తొలుత తన సిబ్బందిని సంఘటన స్థలం వద్ద ట్రాఫిక్కు ఎటువంటి ఇబ్బందిలేకుండా ఏర్పాటు చేశారు. తర్వాత క్రేన్ యజమానికి ఫోన్ చేసి త్వరగా క్రేన్ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హుటాహుటిన క్రేన్ సంఘటన స్థలం వద్దకు చేరుకుని అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగించింది. దీంతో నిలిచి ఉన్న వాహనాలు వెళ్లిపోయాయి. ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

నామినేటేడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

ముదినేపల్లి రూరల్: నామినేటేడ్, స్థానిక సంస్థల పదవుల్లో బీజేపీ శ్రేణులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరారు. బీజేపీ మండలస్థాయి కార్యకర్తల సమావేశం మండల శాఖ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో ముదినేపల్లిలో ఆదివారం జరిగింది. పార్టీ మన్కీబాత్, అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమంపై సమావేశంలో చర్చించారు.

క్లుప్తంగా

వరి నాట్లకు రైతులు సన్నద్ధం



తోట్లవల్లూరు: వరి నాట్లకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వరి నారు అదనుకు వచ్చిన రైతులు తమ పొలాలను బోర్ల నీటితో తడుపుతున్నారు. బోర్ల నీటితోపాటు వర్షాలు కూడా తోడవటంతో పొలాలను తడిపి దమ్ము చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో ప్రతి ఏటా వరి పైరు సాగవుతుంది. దీనిలో నాలుగు వేల ఎకరాల వరకు బోర్ల ద్వారా, మిగిలిన సగభాగం కాలువ నీటి ద్వారా రైతులు సాగు చేస్తారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన వరి నారుమడులు అదనుకు రావటంతో వరినాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలోని క్యూలో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

రోడ్డును బాగు చేయరూ..



పమిడిముక్కల: వీరంకిలాకు నుంచి అగినపర్రు మీదగా కూచిపూడి వెళ్లే ఆర్అండ్బీ రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డంతా గుంతలు పడి, పలుచోట్ల కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రోడ్డు ఎక్కడో కనబడని పరిస్థితి నెలకొంది. ఈ రహదారిపై ప్రయాణం సాగక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. బొడ్డువానిగూడెం, అగినపర్రు, మామిళ్లపల్లి, జువ్వలపాలెం, దేశన్నపాలెం తదితర గ్రామాల ప్రజలు నిత్యం రహదారిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. వీరంకిలాకు–కూచిపూడి రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ గుడివాడ నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. 2024–25 నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా టీఎస్ రాజశేఖర్, కార్యదర్శిగా జి. కిరణ్బాబు ఎంపికైనట్లు కార్యదర్శి కిరణ్బాబు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

నూతన కార్యవర్గ ఎంపికను పురస్కరించుకుని రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ తెలిపారు. రాజేంద్రనగర్ రెండో లైన్లోని జీవీ పూర్ణచంద్రరావు ఫంక్షన్ హాల్లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా కృష్ణాజిల్లా వారి సహకారంతో జరిగే ఈ శిబిరంలో ఆసక్తి గల రక్తదాతలు పాల్గొనాలని వారు కోరారు.

లయన్స్ క్లబ్ ప్రగతి నూతన కార్యవర్గ ఎంపిక

గుడివాడ టౌన్: లయన్స్క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం స్థానిక సత్యనారాయణపురం లోని ఉపద్రష్ట ఫంక్షన్ హాల్లో జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఎన్.శేషగిరిరావు, కార్యదర్శి ఎ.నవీన్, కోశాధికారి పి.రవికుమార్, మల్టిపుల్ చైర్ పర్సన్ శాంతి ఎంపికై ప్రమాణ స్వీకారం చేశారు.

లబ్ధిదారులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటాం



గుడివాడ టౌన్: టిడ్కో లే–అవుట్లో లబ్ధిదారులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం ఆయన అధికారులతో కలిసి టిడ్కో కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో కాలనీలో మౌలిక వసతులు మెరుగు పరుస్తామన్నారు. లబ్ధిదారులకు బ్యాంకులు నోటీసులు ఇచ్చే విషయంపై మాట్లాడుతూ ఏ ఒక్క లబ్ధిదారుడూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే టిడ్కో ప్లాట్ల రుణాల మాఫీపై ప్రకటన వస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ బి.చిన్నోడు, మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం, ఈఈ విజయదుర్గ, డీఈ ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం



వెలంపేటలో చేరిన వర్షం నీటిలో వాహనదారుల అవస్థలు



కైకలూరులో నూతన సచివాలయం వద్ద చేరిన వర్షం నీరు

కైకలూరు: కైకలూరులో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో నిండాయి. పామర్రు–దిగమర్రు జాతీయ రహదిరిపై పలు చోట్లు భారీ గుంతలు పడ్డాయి. కైకలూరు పంచాయతీ నుంచి స్టేషన్కు వెళ్లే రహదారిలో అడుగు లోతు నీరు చేరింది. తహసీల్దారు కార్యాలయ సమీప నూతన సచివాలంయ వద్ద భారీగా నీరు చేరింది. అదే విధంగా ప్రధాన రహదారిలో ప్రభుత్వాస్పత్రి వద్ద రోడ్డుపై నీరు నిలవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. టౌన్హాలులో నీరు చేరి తటాకంలా కనిపిస్తోంది.

నీట మునిగిన వెలంపేట రహదారులు

వెలంపేట కాలనీ రహదారులు వర్షపు నీటికి నీట మునిగాయి. ఇక్కడ డ్రెయిన్లలో నీటి పారుదల లేకపోవడంతో రహదారులపై మురుగునీరు చేరడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలంపేటలో డ్రెయిన్ల నీరు సమీప రైల్వేట్రాక్ సమీప పుల్లవ డ్రెయిన్ ద్వారా వెళ్లాలి. ఇవి పూడుకుపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలుస్తోంది. ముందుగా నిల్వ నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అశోక్కుమార్ పదవీ విరమణ సభ

భట్లపెనుమర్రు(మొవ్వ): పంచాయతీ రాజ్ వ్యవస్థలో 33 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి కృష్ణా జిల్లా పరిషత్ ఉద్యోగుల సహకార పరపతి సంఘ అధ్యక్షుడిగా పనిచేసిన చలసాని అశోక్ కుమార్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొవ్వ మండలం భట్లపెనుమర్రులోని పింగళి వెంకయ్య స్మారక భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళ్లేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఎంపీపీ కొండేటి ఇందిర, గ్రామ సర్పంచ్ మట్టా ఇందిర, కృష్ణా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఆనంద్కుమార్, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ వెస్ట్ కృష్ణా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్, ఏపీ పంచాయితీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తదితరులు అశోక్కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు.



అశోక్కుమార్ దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఘనంగా గంగానమ్మ తల్లి నెల సంబరాలు



రాపర్ల(పామర్రు): రాపర్ల గ్రామంలోని గంగానమ్మ తల్లి ఆలయంలో నెల సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని అమ్మవారికి 108 జలబిందెలతో జలాభిషేకం చేశారు. పసుపు కుంకుమలతో నూతన వస్త్రాలతో అమ్మవారికి విశేషంగా అలంకారాలను చేశారు. అనంతరం గ్రామస్తులు అందరూ అమ్మవారికి వారికి మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కైకలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. ఏలూరు రోడ్ పార్టీ కార్యాలయం వద్ద దొడ్డిపట్ల నుంచి వచ్చిన పార్టీ యువ నాయకులతో ఆదివారం పలు విషయాలపై ఆయన చర్చించారు. పలువురు యువకులు మాట్లాడుతూ దొడ్డిపట్ల గ్రామానికి అనేక సేవలు పార్టీ నుంచి అందాయని, అందరూ కృతజ్ఞతగా ఉంటామని డీఎన్నార్తో తెలిపారు. దీంతో డీఎన్నార్ మాట్లాడుతూ త్వరలో క్షేత్రస్థాయి నుంచి ప్రజలను కలసి మద్దతు కోరదామన్నారు.

నేటి నుంచి పింఛన్ పంపిణీ

కైకలూరు: నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటిసారి పెంచిన పింఛను కైకలూరు నియోజకవర్గంలో సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు తెలిపారు. గ్రామ సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ఒకేరోజు నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేసుకున్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

కైకలూరు: విధి నిర్వహణలో ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే అన్నిచోట్ల గౌరవింపబడతారని కై కలూరు రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్ పేర్కొన్నారు. రూరల్ స్టేషన్ ఏఎస్సై పి.జోసెఫ్ ఉద్యోగ విరమణ సభను ఆదివారం స్టేషన్లో ఘనంగా నిర్వహించారు. అనంతరం జోసెఫ్ దంపతులను పోలీసు సిబ్బంది సత్కరించారు. రూరల్ ఎస్సై టి.రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ

కై కలూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, చినతాడినాడ సర్పంచ్ గండికోట ఏసుబాబు తండ్రి వెంకటేశ్వరరావు ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకుని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కుమారుడు వినయ్ వచ్చి వెంకటేశ్వరరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

3న ఉచిత వైద్యశిబిరం

కైకలూరు: మావనతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ బూరుబోయిన శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా లోకుమూడి గరువు దత్తాశ్రమంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహం రెండు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ ఆదివారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు



ఎమ్మెల్యే కుమార్రాజాకు అభినందనలు తెలుపుతున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

పామర్రు: పామర్రు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు ఎమ్మెల్యే వర్ల కుమార్రాజాను ఆయన కార్యాలయంలో ఆదివారం కలిశారు. సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రెసిడెంట్ కె.యేసుదాసు, వైస్ ప్రెసిడెంట్ సునీల్ పురుషోత్తం, సెక్రటరీ శామ్యూల్, ట్రెజరర్ ఇశ్రాయేలు పాల్గొన్నారు.

సొసైటీలకు ప్రత్యేకాధికారులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు(సొసైటీలు) ప్రత్యేకాధికారులను నియమిస్తూ సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం మారడంతో త్రిసభ్య కమిటీలు రాజీనామా చేయాల్సివచ్చింది. దీంతో ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండలంలోని 15 సొసైటీలకు అధికారులను నియమించారు. వీరిలో ముదినేపల్లి సొసైటీకి కైకలూరు సబ్డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్ ప్రసాదరావు, గురజ సొసైటీకి కైకలూరు సబ్డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ హదీ, దాకరంకు సీనియర్ ఇన్స్పెక్టర్ ఎండీ రహమాన్, వడాలి, దేవపూడి, వాడవల్లి సొసైటీలకు ఏలూరు సబ్డివిజన్ సీనియర్ ఇన్స్పెక్టర్ కె విజయరాజు, బొమ్మినంపాడు సొసైటీకి కైకలూరు సబ్డివిజన్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఆర్ కిరణ్కుమార్, ఉప్పరగూడెం, పెదపాలపర్రు సొసైటీలకు ఏలూరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీవీ నాగేశ్వరరావు, చేవూరు, గోకినంపాడు, కొరగుంటపాలెం సొసైటీలకు ఏలూరు సబ్డివిజన్ సీనియర్ ఇన్స్పెక్టర్ కిరణ్కుమార్, పెనుమల్లికి ఏలూరు సీనియర్ ఇన్స్పెక్టర్ పి.సుధాకర్, చిగురుకోట, వైవాక సొసైటీలకు ఏలూరు సబ్డివిజన్ సీనియర్ ఇన్స్పెక్టర్ టి.వేణుగోపాలరెడ్డి ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సుబ్బారాయుడికి ప్రత్యేక పూజలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోశాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి సన్నిధిలో భక్తులు పిల్లలకు అన్నప్రాసన చేయించారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. 2న శాంతి కల్యాణం స్వామివారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ నెల రెండో తేదీన శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు సహాయ కమిషనర్ తెలిపారు. ఇందులో పాల్గొనే దంపతులు రూ.1,116 చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉత్తమ విద్యార్థినికి నగదు ప్రోత్సాహం



వితరణ అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. ఆదివారం సేవా సంస్థ కార్యాలయంలో గొరిపర్తి కిషోర్ బాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు, 10వ తరగతిలో 507 మార్కులు సాధించిన శానంపూడి రోహికి రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రథమ అధ్యక్షుడు గుత్తా రమేష్, జిల్లా చైర్మన్ పీవీ శేషగిరి రావు, మారుతీ ప్రసాద్, కోశాధికారి ఎ.గోపిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ లంక దాసరి ప్రసాదరావు, డైరెక్టర్ సీతారామ స్వామి పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వనరులు వినియోగించుకోండి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న డాక్టర్ సాంబశివరావు

గుడివాడ టౌన్: ప్రస్తుత సమాజంలో ఎలక్ట్రానిక్ వనరులు వినియోగించుకోవడం ఒక నైపుణ్యం అని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్ వనరుల విభాగాధిపతి డాక్టర్ టి.సాంబశివరావు అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ఎలక్ట్రానిక్ వనరులు వాటి వినియోగం అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. మారుతున్న కాలంలో ప్రతి గ్రంథాలయం టెక్నాలజీకి అనుగుణంగా వివిధ రకాల మెటీరియల్ సమకూర్చుకోవాలన్నారు. వాటిని వినియోగించుకోవడంపై విద్యార్థులకు అవగాహన కలిగించాలని అధ్యాపకులకు సూచించారు. ఉచిత ఇ–రీసోర్సెస్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, బీఎస్ఎస్ పద్మజ, బి. సుభాషిణి పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



శివభరత్కు నగదు అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

కైకలూరు: కలిదిండి గ్రామానికి చెందిన ఓ మహిళకు ముగ్గురు సంతానం. వీరిలో ఇరువురికి ఎదుగుదల లోపం ఏర్పడింది. నెలవారి వైద్య ఖర్చులకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మానవతా స్వచ్ఛంద సంస్థ జన్యులోపం కారణంతో ఎదుగుదల లోపించిన శివభరత్కు రూ.17,000ను ఆదివారం అందించారు. స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి మందిరంలో మానవతా అధ్యక్షురాలు కొండ్రెడ్డి టిట్టెమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగదును అందించారు. కార్యక్రమంలో రీజియన్ –4 చైర్మన్ కొండ్రెడ్డి వెంకటసత్యనారాయణ, సంస్థ కార్యదర్శి మాడెం వీర వెంకటసత్యనారాయణ, కోశాధికారి యిమ్మడి పాండురంగ విఠల్, ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ నానీ, సంయుక్త కార్యదర్శి శీలం కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.